సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



'గురు'తర బాధ్యత

బోధనలో వినూత్న పంథాతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఎందరో ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరిదీ ఒక్కో బాణి. 8లో



దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఎస్సై అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ఉత్సాహంగా జరిగాయి. సోమవారం 699 మంది హాజరయ్యారు. 8లో



పలు రైళ్ల రద్దు

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ సెక్షన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం నుంచి 10వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశారు. 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా సుజాత



తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కళాశాలలో ఆర్థిక శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రఘుపతి వెంకట సుజాత రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. వర్సిటీ వీసీ టి.జానకీరామ్ పర్యవేక్షణలో ఉద్యాన రంగ పరిశ్రమలు స్థాపించేందుకు ఆమె శిక్షణ ఇస్తున్నారు.

8 నుంచి ఆక్వా ఫెస్టివల్



ఏలూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో) : రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్య సంపద వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు ఆక్వా, సీ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఫెస్టివల్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. భూమి, ఆర్గానిక్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 10 వరకు రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీర ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆక్వా, సీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తారన్నారు. సందర్శకుల కోసం రూ.699కే అన్‌లిమిటెడ్ సీ ఫుడ్స్ అందించనున్నారన్నారు. డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా మత్స్యశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ, ఆర్డీఓ కె.పెంచలకిషోర్, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఏడీలు పాల్గొన్నారు.

25లోపు ఓటర్ల జాబితా పూర్తి చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఓటర్ల జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులు చేసి ఈనెల 25 నాటికి జాబితా పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటింటి సర్వే, జంక్ క్యారెక్టర్స్‌ను సవరించి పరిష్కరించే వాటికి సంబంధించి కొన్ని జిల్లాల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తిచేయాలన్నారు. అలాగే తొలగించిన ఓట్లకు సంబంధించి రీ వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 7లోపు పూర్తిచేయాలన్నారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్‌ఓ కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసి రాజు, ఈఆర్వోలు, ఎన్నికల సూపరింటెండెంట్ ఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగిరపర్చాలి

హౌసింగ్ ఎండీ లక్ష్మీషా



ఏలూరు(మెట్రో): నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా ఆదేశించారు. సోమవారం ఏలూరు జిల్లా హౌసింగ్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణంపై మండలాల వారీగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అధికారుల సమన్వయంతో లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. యుడా పరిధిలోని అన్ని లేఅవుట్లలో గృహాలకు సోక్‌పిట్ల నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. కాలనీల స్వాగత ద్వారాల పనులు వేగిరపర్చాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు చెల్లింపులు చేయాలని, ఆప్షన్-3 కింద లబ్ధిదారులందరికీ ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాలు నెలాఖరులోపు తెరవాలన్నారు. రానున్న ఆరు నెలల్లో జిల్లాలో 25 వేల గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు దిశానిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణంలో లక్ష్యాలు, స్టేజ్ కన్వర్షన్, లేఅవుట్ ప్రప్రోజెల్స్, సమస్యాత్మక పనులు, టాప్ 50 వర్క్‌లోడు తదితర అంశాలపై సమీక్షించి సూచనలు ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి పీడీ ఆర్.విజయరాజు, హౌసింగ్ ఏఈలు, ఈఈలు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టి

ఏలూరు(మెట్రో): జిల్లాలోని సచివాలయాల సిబ్బంది పనితీరుపై కమిషనర్లు, ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయాల శాఖ జిల్లా నోడల్ అధికారి రమణ తెలిపారు. సోమవారం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో ఆయన గూగుల్ మీట్ నిర్వహించారు. పీఎంయూ ద్వారా సచివాలయాల సిబ్బంది పనితీరుపై తనిఖీ చేయాలన్నారు. అన్ని అంశాలపై పర్యవేక్షణ చేయాలన్నారు.

కలల వారధి సాకారం

- నరసాపురం వశిష్ట వంతెన నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం
- వచ్చేనెల 13న ఖరారు కానున్న వైనం
- రూ.591.71 కోట్లతో వారధి నిర్మాణం
- స్థల సేకరణకు మరో రూ.60 కోట్లు

నరసాపురం : వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేయడంతో ముందడుగు పడింది. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ద్వారా రూ.591.71 కోట్ల నిధులతో వంతెన నిర్మాణానికి సోమవారం టెండర్లు పిలిచారు. వచ్చేనెల 12 వరకూ టెండర్లు స్వీకరించనున్నారు. 13న న్యూఢిల్లీలోని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో బిడ్లు తెరిచి పనులు ఖరారు చేస్తారు. అలాగే నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేసేలా ఆదేశాలు ఇచ్చారు. వంతెన నిర్మాణంతో పాటు స్థల సేకరణకు మరో రూ.60 కోట్లు మొత్తంగా రూ.650 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ అటు కోనసీమ, ఇటు పశ్చిమగోదావరి జిల్లాల మధ్య వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మాణం దశాబ్దాల డిమాండ్. 2008లో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా సఖినేటిపల్లిలో శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించినా ఆయన మరణానంతరం ప్రాజెక్టు అటకెక్కింది. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఎన్నికల హామీ మేరకు వంతెన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు వంతెన నిర్మాణం ధ్యేయంగా పనిచేశారు.

216 ఎన్‌హెచ్‌కు బైపాస్ నిర్మాణం ద్వారా..

నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వారధి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. కోనసీమ జిల్లా చించినాడ మీదుగా నరసాపురం నుంచి ఒంగోలు వరకు నిర్మించిన 216 జాతీయ రహదారికి బైపాస్ నిర్మించడం ద్వారా వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. కోనసీమ జిల్లా శివకోడు నుంచి టేకిశెట్టిపాలెం మీదుగా ఉన్న రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్పుచేసి రామేశ్వరం మీదుగా ఇటు పశ్చిమగోదావరి జిల్లాలోని రాజుల్లంక, వైఎస్ పాలెం, సీతారామపురం మీదుగా 216 జాతీయ రహదారికి బైపాస్ హైవే రోడ్డు నిర్మించనున్నారు. ఈ క్రమంలో కోనసీమ జిల్లా రామేశ్వరం–నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వశిష్ట గోదావరిపై వంతెన నిర్మించనున్నారు.



వశిష్ట గోదావరిలో పంటుపై ప్రయాణం



2008లో సఖినేటిపల్లిలో వైఎస్సార్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

వశిష్ట వారధి ఇలా..

వంతెన నిర్మాణ వ్యయం	రూ.591.71 కోట్లు
స్థల సేకరణ వ్యయం	రూ.60 కోట్లు
టెండర్ల దాఖలు	సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 12 వరకు
టెండర్ల ఖరారు	అక్టోబర్ 13
వంతెన పొడవు	380 మీటర్లు

వంతెన నిర్మాణ ప్రాంతం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామేశ్వరం నుంచి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం రాజుల్లంక వరకు..

216 ఎన్‌హెచ్ బైపాస్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శివకోడు–టేకిశెట్టిపాలెం–రామేశ్వరం మీదుగా పశ్చిమగోదావరి జిల్లా రాజుల్లంక–వైఎస్ పాలెం–సీతారామపురం

నిర్ణీత కాల వ్యవధిలో..



గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. వశిష్ట వంతెన నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయ్యింది. భూమి తీసుకున్న రైతులకు చెల్లింపులు కూడా జరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నిర్ణీత కాలవ్యవధిలో వంతెన నిర్మాణం జరుగనుంది. టీడీపీ ప్రభుత్వం మాదిరిగా మోసాలు ఉండవు. సీఎం జగన్ బాధ్యత తీసుకుని వంతెన నిర్మాణానికి పూనుకున్నారు.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

సీఎం జగన్ ప్రత్యేక దృష్టితో..

వశిష్ట వారధి నిర్మాణంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాసి ఆమోదముద్ర వేయించారు. ఈ మేరకు 380 మీటర్ల మేర వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేశారు. స్థల సేకరణ యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు.

ప్రతిపక్షాల కుట్రలు

వశిష్ట వంతెన నిర్మాణానికి ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించాయి. స్థల సేకరణ అంశంలో పలుమార్లు కోర్టులకు వెళ్లాయి. దీంతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గట్టి ప్రయత్నం చేసి స్టేను వెకేట్ చేయించి ముఖ్యమంత్రితో శంకుస్థాపనకు సన్నాహాలు చేశారు. దీంతో ప్రతిపక్షాలు రెండోసారి కోర్టు నుంచి స్టే తీసుకువచ్చాయి. ఇలా పలుమార్లు అడ్డంకులు కల్పించినా రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన చిక్కులు లేకుండా చేసి వంతెన నిర్మాణాన్ని టెండర్ల దశకు తీసుకువచ్చింది.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

31 మందికి పురస్కారాలు

సాక్షి, భీమవరం: గురుపూజోత్సవం సందర్భంగా 31 మందిని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ సోమవారం తెలిపారు. మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వీరిని సన్మానించనున్నామన్నారు. పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయుల వివరాలు వెల్లడించారు. డి.ప్రసన్నభారతి (పెదఅమిరం), ఎండీ ఖుద్దుస్ (శృంగవృక్షం), కె.నాగేశ్వరరావు (తాడేపల్లిగూడెం), ఎస్.సతీష్‌బాబు (ఇరగవరం), పి.నీలవేణి(వరిగేడు), పీఎస్ఎన్ మల్లేశ్వరరావు (వీరవాసరం), కె.విజయశ్రీ (బొండాడ), పీఎస్ఎన్ మల్లేశ్వరరావు (వీరవాసరం), కె.విజయశ్రీ (బొండాడ), బి.సునీత (గరగపర్రు), పీఎన్‌డీవీ రత్నం (కె.ఇల్లింద్రపర్రు), బి.నాగమురళి శ్రీనివాసరావు (వేంపాడు), జి.గోపాలకృష్ణ ప్రసాద్ (వెంకట్రాయపురం), ఎ.కాశీ విశ్వనాథం(బ్రాహ్మణచెరువు), సీహెచ్ ప్రభాకరరావు (కోళ్లపర్రు), కె.నరేంద్ర (తేతలి), ఎస్.విజయకుమారి (ఒడూరు), ఎన్.బుజ్జిబాబు (లక్కవారితోట), ఎస్.రామకృష్ణ (సత్యవరం), పి.సత్యం (చెరువుగట్టుపాలెం), జి.కళ్యాణి (నెగ్రాపేట, భీమవరం), జి.దుర్గా రాజశేఖర్ (పెర్కిపాలెం), డీవీ సుబ్బారావు (గుబ్బలవారిపాలెం), ఆర్.పాపారావు (రాపాక), జి.అపర్ణ జి (కొండూరుపాడు), టీజీ కాంతకుమారి (సూరంపూడి), కె.కరుణ (నీలాద్రిపురం), వి.శ్రీనివాస్ (పేకేరు), టి.గృహలక్ష్మి (తూర్పుతాళ్లు), మాధవి (జిన్నూరు), పీఎం చంద్రమోహన్ (ఉప్పరగూడెం), పి.లక్ష్మీ సునీత (చినఅమిరం), ఎస్.రామకృష్ణ (పాలకోడేరు) జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు.

పోలసానిపల్లిలో టీడీపీకి షాక్

భీమడోలు: పోలసానిపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఉప సర్పంచ్ పదవిని సాధించుకోవాలనే టీడీపీ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఆరుగురు టీడీపీ మద్దతు వార్డు సభ్యుల్లో నలుగురు వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థికి జైకొట్టారు. దీంతో ఉప సర్పంచ్‌గా కోట శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత పంచాయతీ ఎన్నికల్లో పంచాయతీలోని 12 వార్డుల్లో ఏడు వైఎస్సార్ సీపీ, ఐదు టీడీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారు జల్లా బాలు ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అయితే ఆయన అనారోగ్యంతో మృతిచెందగా ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో టీడీపీ మద్దతురాలు 10 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీకి వార్డు స్థానాలు సమంగా వచ్చాయి. ఈ క్రమంలో ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం జరగ్గా టీడీపీ మద్దతుదారులు నలుగురు వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థికి జైకొట్టారు. ఇద్దరు టీడీపీ మద్దతు వార్డు సభ్యులు గైర్హాజరయ్యారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఉంగుటూరు నియోజకవర్గంలో పూర్తయిన తరుణంలో నలుగురు వార్డు సభ్యులు వైఎస్సార్ సీపీ ఉపసర్పంచ్‌కు మద్దతు ఇవ్వడం, 2వ వార్డు టీడీపీ సభ్యురాలు చెరుకూరి కమల వైఎస్సార్ సీపీలో చేరడంతో టీడీపీకి భారీ షాక్ తగిలింది. మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, వార్డు సభ్యుల సమక్షంలో కమల వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలో విజయోత్సవ సంబరాలు జరిగాయి. పోలసానిపల్లి, భీమడోలులో ర్యాలీలు నిర్వహించారు.



టీడీపీ మద్దతు వార్డు సభ్యురాలు కమలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

మహిళాభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి : మహిళల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ చేశారని, మాట ఇవ్వకపోయినా సున్నావడ్డీ అమలుచేస్తున్నారన్నారు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో రూ.25 వేల కోట్ల రుణమాఫీ సొమ్ములు, రూ.7 వేల కోట్ల సున్నావడ్డీ కింద మొత్తం రూ.32 వేల కోట్ల లబ్ధిని చేకూర్చారన్నారు. అత్తిలి మండలంలో 2022–23కి 1,527 గ్రూపులకు సున్నావడ్డీ పథకంలో రూ.2.18 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. సెప్టెంబర్‌లో కొత్తగా 505 ఫించన్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వాలు హామీలకే పరిమితం కాగా.. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం జగన్ ఆకాంక్షగా ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. చంద్రబాబుకి ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిందని, త్వరలో ఆయన జైలుకెళ్లడం ఖాయమన్నారు. సీఎం జగన్‌ను ప్రతి ఇంట్లో కుటుంబసభ్యుడిగా ప్రజలంతా భావిస్తున్నారన్నారు. పేద విద్యార్థుల చదువులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు సున్నావడ్డీ పథకం కింద రూ.2.18 కోట్ల చెక్కు అందజేశారు. కొత్తగా మంజూరైన 505 పింఛన్లు, 370 రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, జెడ్పీటీసీ అడ్డాల జానకి, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అత్తిలిలో డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం

జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు రీ ఓపెన్ కానివిధంగా కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్‌తో కలిసి 220 అర్జీలు స్వీకరించారు.

అర్జీల్లో కొన్ని..


- తమను ఓబీసీ కేటగిరీలో చేర్చాలని పాలకొల్లు తూర్పు కాపు విద్యా విజ్ఞానాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో తూర్పు కాపులు వినతిపత్రం అందజేశారు.
- వీరవాసరంలో పీపీ రోడ్డు ఆనుకుని పశ్చిమ పంట కాలువ నుంచి తూర్పున ఉన్న గొంతేరు మురుగు కాలువకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో ప్రమాదాలు జరుగుతున్నాయని సామాజిక కార్యకర్త నక్కెళ్ల శివరామకృష్ణ జేసీ దృష్టికి తీసుకువచ్చారు.
- తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన 30 మంది రైతులు 1972 నుంచి జిల్లాపరిషత్ భూములను సాగు చేస్తున్నామని, పన్నులు కూడా చెల్లిస్తున్నామని, శాశ్వత సాగు హక్కు పట్టాలు ఇప్పించాలని జేసీని కోరారు. జిల్లా అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

ఓటర్ల పునః పరిశీలన తప్పనిసరి

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం(ప్రకాశం చౌక్): తొలగించిన ఓటర్లను ఈఆర్వోలు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పునః పరిశీలన చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణపై ఆమె సమీక్షించారు. పెండింగ్ క్లయిమ్‌లను ఈనెల 19లోపు పరిష్కరించాలన్నారు. డెత్ ఓటర్ల తొలగింపును ఏడు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. ఇంటింటి సర్వే నివేదికను బీఎల్‌ఓల వారీగా అందజేయాలన్నారు. షిఫ్టెడ్ ఓటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత తొలగించాలన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా పోలింగ్‌స్టేషన్ల మార్పుకు అందిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు నివేదిక సమర్పించాలన్నారు. ఆచంట, పాలకొల్లు, తణుకులో ఒక్కో పోలింగ్‌స్టేషన్ మార్పు చేయాలని ఈఆర్వోలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నివేదికల సమర్పిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, నరసాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసి రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి ఎ.దుర్గేష్, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లకు దరఖాస్తులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో డిప్లమో/ఐటీఐ/పాలిటెక్నిక్/గ్రాడ్యుయేషన్ ఆపై తరగతులు రెగ్యులర్‌గా చదువుతున్న దివ్యాంగులైన విద్యార్థులు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు పొందేందుకు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జీసీహెచ్ ప్రభాకర్ ఓ ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వైకల్యం, ఆధార్, 10వ తరగతి, వయసు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బోనఫైడ్ సర్టిఫికెట్ అందజేయాలని పేర్కొన్నారు. కుటుంబ ఆదాయం రూ.3 లక్షలలోపు, వైకల్యం 40 శాతం ఆపై ఉండాలని తెలిపారు. వివరాలకు ఫోన్ 08812–234146లో సంప్రదించాలని కోరారు.

చకచకా ఈకేవైసీ

- పంటకు రక్ష.. రైతుకు భరోసా
- జిల్లాలో 90 వేల మందికి ఈకేవైసీ పూర్తి
- 15లోపు లక్ష్యం పూర్తిచేసేలా ఆదేశాలు

సాక్షి, భీమవరం: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలుచేస్తోంది. గత పాలకులు వ్యవసాయం దండగ అంటూ రైతులపై వివక్ష చూపగా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేస్తూ రైతులకు అన్ని విధాలా అండగా ఉంటున్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి విత్తనాల పంపిణీ నుంచి ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరలకు విక్రయిస్తూ, యంత్ర సామగ్రిని రాయితీపై అందిస్తున్నారు. సాగుకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు దళారుల ప్రమేయం లేకుండా పంటలను కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు.

ముమ్మరంగా ఈకేవైసీ నమోదు

ప్రస్తుతం జిల్లాలో సార్వా వరినాట్లు పూర్తికావడంతో పైరు ఏపుగా పెరుగుతోంది. దీంతో రైతులు వేసిన పంటను నమోదు చేసే పనిలో (ఈ–క్రాప్) వ్యవసాయశాఖ నిమగ్నమైంది. జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 2.12 లక్షల మంది రైతుల పంట నమోదుచేయాల్సి ఉండగా ఇప్పటికే దాదాపు 90 వేల మందికిపైగా ప్రక్రియ పూర్తిచేశారు. ఈనెల 15 నాటికి ఈకేవైసీ పూర్తిచేయాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ పనిచేస్తోంది.

రైతులకు ఎంతో మేలు

ఈకేవైసీ ద్వారా రైతులకు పలు ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తోంది. పీఎం కిసాన్–రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తోంది. అలాగే ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ రాయితీ, ధాన్యం అమ్మకాలు వంటి అమలు చేస్తోంది. వీటన్నింటికీ ఈకేవైసీ తప్పనిసరి. ఈ మేరకు వ్యవసాయశాఖ పంటల వివరాలు నమోదు చేస్తోంది. దీని ద్వారానే రైతులకు ఎరువులు, పురుగు మందులు వంటివి రాయితీలను సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ ప్రాధాన్యతను గుర్తించి రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



భీమవరం మండలంలో ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

90 వేల మందికి పూర్తి



రైతులు వేసిన పంటను ఈకేవైసీ చేయించడం ద్వారా పలు ప్రయోజనాలున్నాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించడంతో వేగంగా ఈకేవైసీ చేయించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 2.12 లక్షల మంది రైతులు ఉండగా ఇప్పటికే 90 వేల మందికి పైగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తయ్యింది. మిగిలిన వారికి ఈనెల 15లోపు ఈకేవైసీ పూర్తిచేయాలని వ్యవసాయశాఖ సిబ్బందికి ఆదేశాలిచ్చాం. ఈ మేరకు త్వరితగతిన పనులు జరుగుతున్నాయి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

రేషన్ బియ్యం సీజ్



ఫాతిమాపురం చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

చింతలపూడి: చింతలపూడి మండలం ఫాతిమాపురం చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 4 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం ఉదయం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు చెక్‌పోస్ట్ వద్ద మాటువేసి పట్టుకున్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ చింతకాయల గురునాథంను అదుపులోకి తీసుకుని విచారించారు. పెద్దిరెడ్డి రామచంద్రరావు, దీపులు చింతలపూడి, నూజివీడు, చాట్రాయి తదితర ప్రాంతాల్లో రేషన్ బియ్యం కొని కాకినాడ తరలిస్తున్నట్లు చెప్పారన్నారు. నిందితులపై నిత్యావసర చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పలు రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): విజయవాడ సెక్షన్ పరిధిలో ఈ నెల 3 నుంచి 10 వరకూ పలు రైళ్లను రద్దు చేసినట్లు, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నం-లింగంపల్లి జన్మభూమి ఈ నెల 3 నుంచి 9 వరకూ, లింగంపల్లి-విశాఖ మధ్య జన్మభూమి ఈ నెల 4 నుంచి 10 వరకూ రద్దు చేశారు. గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌ను 3 నుంచి 9 వరకూ.. రాయగడ-గుంటూరు రైలును ఈ నెల 4 నుంచి 10 వరకూ, విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను ఇరువైపులా ఈ నెల 3 నుంచి 10 వరకూ రద్దు చేశారు. మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 4 నుంచి 9 వరకూ, విశాఖపట్నం-మచిలీపట్నం రైలును ఈ నెల 5 నుంచి 10 వరకూ పూర్తిగా రద్దు చేశారు. తిరుపతి-విశాఖపట్టణం మధ్య నడిచే రైలును ఈ నెల 6 నుంచి 8 వరకూ, విశాఖపట్నం-తిరుపతి రైలును ఈ నెల 7 నుంచి 9 వరకూ సామర్లకోట వరకూ నడపనున్నారు.

బోధనలో 'గురు'తర బాధ్యత



సృజన కార్యక్రమాలపై అప్పటి పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వివరిస్తున్న సర్వేశ్వరరావు



బొమ్మలతో శ్రీదేవి పాఠ్యాంశాలు



పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల బోధన చేస్తున్న సముద్రుడు మాస్టారు

- శిష్యులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ..
- ఒక్కొక్కరిదీ ఒక్కో బాణీ
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మన భారతీయ సంస్కృతిలో గురువుకు మహోన్నత స్థానం కట్టబెట్టారు. గురు శిష్యుల బంధాన్ని మన ఇతిహాసాలు ఎంతో ఉన్నతంగా పరిచయం చేశాయి. ఏ రంగంలో రాణించాలన్నా, నైపుణ్యం సాధించాలన్నా ఎవరో ఒక గురువు వద్ద శిక్షణ పొందాలి. ఆధునిక సమాజంలో గురు స్థానంలో ఉపాధ్యాయుడినే ఊహించుకుంటాం. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తమ శిష్యులను ఉన్నత స్థానాలకు చేర్చడానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు ఎంతోమంది ఉన్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారిలో కొందరి సేవల్ని గుర్తు చేసుకుందాం.

ఆంగ్ల బోధనలో దిట్ట

కైకలూరు: సముద్రుడు మాస్టారు.. ఈ పేరు చెప్పగానే విద్యార్థులకు ఆంగ్లభాష గుర్తుకొస్తుంది. 1998 డీఎస్సీ ద్వారా కైకలూరు మండలం వదర్లపాడు పాఠశాలలో గోల్కొండ సముద్రుడు విధుల్లో చేరారు. భుజబలపట్నం, వెలంపేట, చటాకాయి పాఠశాలల్లో పనిచేసి ప్రస్తుతం భైరవపట్నం పాఠశాలలో ఇంగ్లీషు బోధన చేస్తున్నారు. సముద్రుడు మాస్టారు చిత్రాలతో ఆంగ్ల భాషను అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు బోధిస్తున్నారు. ద్రాక్ష చెట్టు, నక్క బొమ్మలను బోర్డుపై చిత్రించి వాటిని ఇంగ్లీషులో చెప్పడం వల్ల తేలిక పద్ధతిలో విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇంగ్లీషులో మాట్లాడడంతో తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. మాస్టారు వద్ద ఇంగ్లీషు నేర్చుకున్న విద్యార్థులు పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు.

సర్వేశ్వరరావు సృజన



అంగులూరి సర్వేశ్వర రావు ప్రస్తుతం ఏలూరు జిల్లా ఉమ్మడి పరీక్షల సంస్థ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయన 1997లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరాలనే సంకల్పంతో ఆది నుంచి అనేక బోధనా పద్ధతులు అమలు చేసేవారు. సమగ్రశిక్షలో ఏఎంఓగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆయన బోధనా పద్ధతులకు మరింత పదును పెట్టారు. ఎంతో సృజనాత్మకంగా ఆయన ప్రవేశ పెట్టిన సృజన కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. అప్పట్లో సుమారు 100 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సుమారు 250 టీచర్ లెర్నింగ్ మెటీరియల్ నమూనాలు (టీఎల్ఎం) రూపొందించారు. వాటిని ప్రత్యేక వ్యాన్ ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రదర్శించారు. ఈ నమూనాలతో రూపొందించిన పుస్తకం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పంపిణీ చేసి వాటి ఆధారంగా బోధన చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి. దానితో పాటు ఆయనకు జాతీయ స్థాయిలో అవార్డులను తెచ్చిపెట్టాయి.

హాకీ క్రీడాకారిణులను తీర్చిదిద్దుతూ..



వి.శ్యామల లింగపాలెం మండలం సింగగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నారు. ఆమె 1997వ సంవత్సరంలో దెందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. అనంతరం గోపన్నపాలెంలోని వ్యాయామ కళాశాలలో 22 సంవత్సరాల పాటు సేవలందించారు. ఆమె శిక్షణలో అనేక మంది హాకీ క్రీడాకారిణులు ఆ క్రీడలో ఎంతో నైపుణ్యం సంపాదించి జాతీయ స్థాయికి ఎదిగారు. ఆయా క్రీడాకారులు జాతీయ హాకీ జట్టులో స్థానం పొంది దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం ఆమె హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ హాకీ సెలక్షన్ కమిటీ సభ్యురాలిగా వ్యవహరిస్తూ ప్రతిభే ప్రామాణికంగా నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ క్రీడాకారులను ఎంపిక చేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు.

శిష్యులే సహోద్యోగులుగా..



బొడ్డు రాంబాబు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వద్ద కాపుల కొడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. 2002 సంవత్సరంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. ప్రస్తుతం మను ప్రకాష్ కథా సాహిత్యం అనే అంశంపై పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆయన గత 25 సంవత్సరాల నుంచి హిందీ ప్రచార సభ నిర్వహించే ప్రాథమిక, మాధ్యమిక తదితర హిందీ పరీక్షలు రాసే వందలాది మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. రాంబాబు వద్ద శిక్షణ పొందిన పలువురు ప్రస్తుతం ఉద్యోగాలు పొంది ఆయనతో పాటు సహోద్యోగులుగా పని చేస్తూ గురువుకు తగ్గ శిష్యులుగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. రాంబాబు వద్ద హిందీ శిక్షణ పొందిన వారిలో పలువురు కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల్లో స్థిరపడడం విశేషం.

ఆట, మాట, పాటలే పాఠాలు



హెచ్ఎం శ్రీదేవి పెదవేగి మండలం కొప్పాక ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. 2000 సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన శ్రీదేవి బోర్డుపై నోట్సు రాయడం, పుస్తకాలతో పాఠాలు చెప్పడం విద్యార్థులకు బోరు కొట్టే బోధనా పద్ధతులని గ్రహించారు. విద్యార్థులకు ఎలా శ్రద్ధగా పాఠాలపై దృష్టి కేంద్రీకరిస్తారో అధ్యయనం చేశారు. అప్పటి నుంచి ఆటల ద్వారా, మాటల ద్వారా, పాటల ద్వారా పాఠాలు చెప్పడం ప్రారంభించి సత్ఫలితాలు సాధిస్తున్నారు. పిల్లల చేతే బొమ్మలు తయారు చేయించడం, చార్టులపై సంబంధిత పాఠాలు కనిపించేలా ఏర్పాటు చేయడంతో పాఠ్యాంశాలకు ఆకర్షితులయ్యేలా కృషి చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం

ఆకివీడు: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో నివసిస్తున్న మైనర్‌పై బాలుడు అత్యాచారం చేసిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు చెప్పారు. ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసును ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మదర్సా నుంచి తప్పిపోయిన పిల్లల అప్పగింత

నూజివీడు: మండలంలోని బోర్వంచలో ఉన్న మదర్సా నుంచి తల్లిదండ్రులపై బెంగతో సోమవారం ఉదయం సమయంలో ముగ్గురు పిల్లలు బయటకు వెళ్లిపోయారు. ముగ్గురు పిల్లలు ఆగిరిపల్లి వైపు వస్తున్నారన్న సమాచారం మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరు చంటిబాబు తన సిబ్బందితో గాలించి వారిని పట్టుకున్నారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి మదర్సా నిర్వాహకులకు అప్పగించారు.

చికెన్ వ్యర్థాల వ్యాన్ సీజ్



వ్యాన్‌తో పాటు ఇద్దరు వ్యక్తులను పట్టుకున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు: చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని సోమవారం భీమడోలు పోలీసులు అరెస్టు చేశారు. పెదపాడు మండలం నాయుడుగూడెంకు చెందిన అసిలేటి చందు వ్యాన్‌పై డ్రైవర్ ఆర్జా ఉదయ్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్ నుంచి కోడి మాంసం వ్యర్థాలను సేకరించి ఆగడాలలంక గ్రామంలోని ఆక్వా చెరువులకు సరఫరా చేస్తున్నాడు. వారిద్దరిపై కేసు నమోదు చేశారు. చికెన్ వ్యర్థాలతో పాటు వ్యాన్‌ను సీజ్ చేశారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

చాట్రాయి: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి పెదవేగికి వాహనం ద్వారా కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా మండలంలోని కృష్ణారావుపాలెం చెక్ పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బంగారం, నగదు చోరీ

జంగారెడ్డిగూడెం: స్థానిక సాలిపేట చర్చి వీధిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. కొండా కాళిదాసు, ఆయన భార్య 10 రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లారు. పట్టణంలో ఉన్న ఆయన కుమారుడు కొండా ఉమామహేష్ ఆయన భార్య ప్రతీ రోజు వచ్చి ఇంటి తాళాలు పరిశీలించి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఇంటి శుభ్రంచేసేందుకు వచ్చిన ఉమామహేష్, ఆయన భార్య తాళాలు పగులగొట్టి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్రైం పార్టీ ఏఎస్సై ఎస్‌వీ సంపత్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంగారం, వెండి వస్తువులు, నగదును దోచుకు వెళ్లినట్లు గుర్తించారు. ఎంత చోరీకి అయ్యిందో తెలియ్యాలి ఉంది.

ఎస్సై పోస్టులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు టౌన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఎస్సై పోస్టుల రెండో దశ ఎంపిక ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేపడుతున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో 9,689 మంది అభ్యర్థులు పరీక్షలకు ఎంపిక అయ్యారు. ఆగస్టు 25 నుంచి వివిధ పోటీలు నిర్వహించి సత్తా చాటుకున్న అభ్యర్థులను తుది దశ పరీక్షలకు ఎంపిక చేస్తున్నారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్వీయ పర్యవేక్షణలో పోటీలు పగడ్బందీగా చేపడుతున్నారు. సోమవారం సుమారు 800 మంది అభ్యర్థులు వివిధ పోటీలకు హాజరుకావాల్సి ఉండగా 699 మంది పాల్గొన్నారు. తొలుత అభ్యర్థులకు సంబంధించి ఎత్తు, ఛాతి, బరువు వంటి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. అనంతరం 100 మీటర్లు, 1600 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. డీఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపిక పరీక్షల్లో ఎక్కడా అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పోటీలు చేపడుతున్నామన్నారు.



1600 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు



అభ్యర్థులకు జియోట్యాగింగ్ చేస్తున్న సిబ్బంది



అభ్యర్థి ఛాతీని కొలుస్తున్న సిబ్బంది



లాంగ్‌జంప్‌లో పాల్గొన్న అభ్యర్థి

హత్యాయత్నం కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భూ వివాదానికి సంబంధించిన ఘటనలో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టెన్నపాలెంకు చెందిన గొర్రె శ్రీనివాసరావు స్థలంలో అదే గ్రామానికి చెందిన జి.బలరాం, జి.గంగలు పందిరి నిర్మాణం చేశారన్నారు. ఆదివారం శ్రీనివాసరావు, అతని భార్యలు ఆ విషయమై నిలదీశారు. దీంతో బలరాం, గంగలు గొడ్డలితో శ్రీనివాసరావు, అతని భార్యపై దాడి చేశారన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు, అతని భార్య జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి



సి.పురుషోత్తం కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాలలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ కోరారు. స్థానిక జిల్లా కోర్టు నుంచి సోమవరం భీమవరం, తణుకు, నరసాపురం, కొవ్వూరు మేజిస్ట్రేట్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి పరిధిలో అత్యధికంగా క్రిమినల్ కేసులు పరిష్కారం చేయడానికి కృషి చేయాలన్నారు. కక్షిదారులకు నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. సంబంధిత పోలీసు అధికారులు కూడా న్యాయస్థానాలకు సహకరించాలని కోరారు. ప్రతి రోజు జిల్లాలో అన్ని కోర్టుల పరిధిలో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని, క్రిమినల్ కేసులతో పాటు శ్రీరామ్ సిటీ ఫైనాన్స్, ట్రాన్స్‌పోర్టులకు సంబంధించి ఈపీలతో(అమలు పిటీషన్) పాటు ఇతర ఈపీలకు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

సూసైడ్ నోట్‌లో ముగ్గురి పేర్లు వెల్లడి



మృతుడు చెక్క తేజ(ఫైల్)

దెందులూరు: భార్యాభర్తల మధ్య వివాదాలు ఒక మనిషి ప్రాణాన్ని బలితీసుకున్నాయి. భార్య తరపు బంధువులు, పోలీసుల వేధింపులు భరించలేక మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి, బంధువులు ఆరోపించారు. దెందులూరు గ్రామానికి చెందిన చెక్క రామ్‌ప్రసాద్ కుమారుడు చెక్క తేజ మూర్తి (26) సోమవారం తెల్లవారుజామున దెందులూరులో రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. అతని వద్ద సూసైడ్ నోట్‌ను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులతో పాటు స్థానిక పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తేజమూర్తి తల్లి ధర్మ రత్నమాల, పెదనాన్నలు మానేపల్లి ఉదయ్‌భాస్కర్, మానేపల్లి మురళీ, బావమరిది చలంచెర్ల సత్యకిషోర్ సోమవారం మధ్యాహ్నం దెందులూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పలు ఆరోపణలు చేశారు. మూడు నెలల క్రితం ఏలూరుకు చెందిన ప్రియాంకతో తేజమూర్తికి వివాహం జరిగిందని, వారిద్దరూ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గత నెల 26న ప్రియాంక ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో భర్త తేజమూర్తిపై ఫిర్యాదు చేసింది. పెద్దలు మాట్లాడినా, నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ప్రియాంక అంగీకరించలేదని తెలిపారు. విచారణ పేరుతో సీఐ రాజశేఖర్ వేధించారని ఆరోపించారు. కేసు పరిష్కారానికి నెల గడువు ఇవ్వమని అడిగినా తమ మాట వినలేదని వాపోయారు. ఈ మానసిక ఒత్తిడితోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తేజ తల్లి, బంధువులు ఆరోపించారు. సూసైడ్ నోట్‌లో నిన్ను ప్రేమించానని.. జరగనిది జరిగినట్లే నిందలు వేయడాన్ని తట్టుకోలేకపోతున్నానని భార్యనుద్దేశించి తేజమూర్తి పేర్కొన్నాడు. తన మృతికి ప్రియాంక తండ్రి తవ్వ సత్యనారాయణ, అక్క సౌజన్య, మావయ్య సురేష్ కారణమని రాశాడు. తనకు తగిన న్యాయం చేసే వరకు పోరాడాలని బంధువులను కోరాడు. తల్లిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించాడు. ఈ సంఘటనలో తేజ కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. తేజమూర్తి మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి పంపించారు. కేసును రైల్వే ఎస్సై డీ.నర్సింహరావు దర్యాప్తు చేస్తున్నారు.

దర్యాప్తు చేస్తున్నాం

ఏలూరు టౌన్: తేజ మూర్తి ఆత్మహత్య ఘటనలో వన్‌టౌన్ సీఐపై ఆరోపణలు వచ్చాయని.. వాస్తవాలపై శాఖాపరమైన విచారణ చేస్తున్నామని, అసత్య ప్రచారాలు చేయవద్దని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు తెలిపారు. తేజమూర్తి భార్య ఫిర్యాదు మేరకు సీఐ ఇరు పక్షాల కుటుంబ సభ్యులు, పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపారు. సూసైడ్ నోట్‌లో మృతుడు సీఐ తనను వేధించినట్లు చెప్పలేదన్నారు. చట్టం మేరకే సీఐ విచారణ చేశారని, బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో ప్రమాదం.. వ్యక్తి మృతి



చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎస్సై కె.ప్రసాద్

చింతలపూడి: చింతలపూడి మండలం సీతానగరం పామాయిల్ ఫ్యాక్టరీలో ప్రమాదవశాత్తూ సోమవారం ఒక కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన సోహాల్ సింగ్(20) మూడు నెలల క్రితం పామాయిల్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా చేరాడు. సోమవారం ఉదయం యథావిధిగా ఫ్యాక్టరీలో పని చేస్తుండగా యంత్రానికి ఉన్న బెల్ట్‌లో చిక్కుకుని ప్రమాదానికి గురయ్యాడు. అప్రమత్తమైన తోటి కార్మికులు బాధితుడిని సత్తుపల్లి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సింగ్ మృతి చెందడంతో మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎస్సై కె.ప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయు నాయకులు టిఎన్‌విడి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి రూ. 50 లక్షలు నష్టపరిహారం అందించాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

దోమల నియంత్రణ అందరి బాధ్యత



దోమల నియంత్రణ గురించి వివరిస్తున్న వైద్యశాఖాధికారులు

తాడేపల్లిగూడెం: దోమల నియంత్రణ అందరి బాధ్యత అని గూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్షణరావు అన్నారు. పట్టణ ఆరోగ్యకేంద్రాల సిబ్బందితో సోమవారం జరిగిన కార్యక్రమంలో కీటక నియంత్రణ చర్యలపై మాట్లాడారు. డ్రైడే వంటి కార్యక్రమాల అమలులో సాంకేతిక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, ఎస్.అమృత, ఆరోగ్యకార్యదర్శులు, ఆరోగ్యసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లు కష్టపడితే నలభై ఏళ్ల జీవితం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు

తాడేపల్లిగూడెం: నాలుగేళ్లు కష్టపడితే నలభై ఏళ్ల సుఖవంతమైన జీవితం వస్తుందని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ తొలి ఏడాది తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వక్తలు తెలిపారు. పెదతాడేపల్లిలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం 180 మంది విద్యార్థులతో ప్రారంభించిన ఈ కళాశాల నేడు రాష్ట్రంలో పేరెన్నికగన్న కళాశాలగా ఎదిగిందని అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు అన్నారు. అటానమస్ స్థాయికి చేరి అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఆధునిక కోర్సులను విద్యార్థులకు అందిస్తోందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాలకవర్గ కోశాధికారి బాలకాశయ్య, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో చదవాలి



మురళీకృష్ణను అభినందిస్తున్న స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం

నరసాపురం రూరల్: విద్యార్థులు పోటీతత్వంతో చదివి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కాకినాడ జేఎన్‌టీయూకి చెందిన ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంట్రాక్షన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణతోపాటు స్వర్ణాంధ్ర ట్రెజరర్ త్రినాథ్, డైరెక్టర్ అద్దాల శ్రీహరి మాట్లాడుతూ నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తయ్యేలోపు సబ్జెక్టుపై పట్టుసాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఆడిటర్ రాంబాబు, ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, పండరీనాథ్, హెచ్‌వోడీ స్వామినాథన్ వివిధ విభాగాల ప్రధాన అధ్యాపకులు కొంతమంది సీనియర్ విద్యార్థులు మాట్లాడారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో స్వర్ణాంధ్ర కళాశాల ఆవరణలో సందడి నెలకొంది.

నేడు మానవత ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

పెంటపాడు: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ, మండల పరిషత్ విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5న పెంటపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తములైన 6 గురు గురువులను ఎంపిక చేసి సన్మానం చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 10 పెంటపాడు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద జరిగే ఈ సమావేశానికి సిబ్బంది, ఉపాధ్యాయులు విధిగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తణుకు ఎంపీడీవోగా కిరణ్‌కుమార్

తణుకు టౌన్: తణుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా కె కిరణ్ కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలంలో ఏవోగా విధులు నిర్వర్తించిన కిరణ్ కుమార్ పదోన్నతిపై తణుకు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఎంపీడీవో కిరణ్‌కుమార్ ఎంపీపీ, జెడ్పీటీసీ,లను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ-క్రాప్‌తో రైతులకు భరోసా

- గూడెం డివిజన్‌లో 23 ఎకరాల్లో పంట నమోదు
- ఇంకా మిగిలి ఉన్న 40వేల ఎకరాలు
- ఈ నెల 15వ తేది తుది గడువు



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ నవ్యశ్రీ

తాడేపల్లిగూడెం రూరల్: పంట నమోదు ద్వారా రైతులకు భరోసా కలగనున్నది. గతంలో ఈ-క్రాప్ నమోదు లేకపోవడం వల్ల కౌలు రైతు కంటే భూమి గల రైతుకు లబ్ధి చేకూరేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఈ-క్రాప్ ద్వారా అసలు కౌలుదారు పేరును ఈ-క్రాప్‌లో నమోదు చేయడం వల్ల అతనికి లబ్ధి చేకూరుతుంది. ఇందుకు సంబంధించి కౌలు రైతులకు ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డులను అందజేస్తుంది. ఈ కార్డులు పొందిన కౌలు రైతులకు సైతం ఈ-క్రాప్ ద్వారా లబ్ధి చేకూరుతుంది. ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన రైతు, కౌలు రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సర్వే నెంబరు, అసలు సాగుదారు, పంట పేరున ఈ-క్రాప్ నమోదు చేయడం జరుగుతుంది. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ సున్నా వడ్డీ, రైతు భరోసా ద్వారా తక్కువ ధరకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు సరఫరా, వ్యవసాయ యంత్ర సేవ, పండిన పంటలు ఆర్‌బీకేల్లో విక్రయించుకునే వెసులుబాటు కలుగుతుంది. సదరు పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకోనున్నది. గ్రామాల్లో ప్రతీ రైతు పాలం వద్దకు వెళ్లి ఏ సర్వే నెంబరులో ఏ పంట పండుతుంది ? రైతు వివరాలను జియో కోఆర్డినేటర్స్ నమోదు చేస్తారు. తదుపరి పంట సాగు చేస్తున్న రైతు, కౌలురైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ వేయవలసి ఉంది.

గూడెం డివిజన్‌లో 23 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు: తాడేపల్లిగూడెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాలు ఉన్నాయి. తాడేపల్లిగూడెం మండలంలో 28,500 ఎకరాలకు గాను 7900 ఎకరాల్లో, పెంటపాడులో 22వేల ఎకరాలకు గాను ఏడు వేల ఎకరాలు, గణపవరం మండలంలో ఏడు వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదైంది. మరో 40 వేల ఎకరాల్లో పంట నమోదు కావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

ఎంతో ప్రయోజనం



ప్రతీ రైతు ఈ-క్రాఫ్ చేయించుకోవాలి. ముందుగానే ఈ-క్రాప్ చేయించుకోవడం ద్వారా పంట రుణాలు పొందడం, పంట విక్రయించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవు. పంట సొమ్ములు సైతం ఎటువంటి ఇబ్బందులు లేకుండా సొమ్ములు జమ అవుతాయి. ఈ-క్రాఫ్ దశలోనే సమస్యలు పరిష్కారమవుతాయి. దీని వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– అక్కిన వీరరాఘవులు, రైతు, కొండ్రుప్రోలు, తాడేపల్లిగూడెం మండలం

15లోగా నమోదు



తాడేపల్లిగూడెం డివిజన్‌లోని ప్రతీ రైతు ఈ నెల 15వ తేదిలోగా తమ పంటను ఈ-క్రాఫ్‌లో నమోదు చేసుకోవాలి. వరితో పాటు ఉద్యాన పంటలను సైతం ప్రభుత్వం ఈ-క్రాఫ్ పరిధిలోకి తీసుకొచ్చింది. సంబంధిత రైతులు సైతం ఈ-క్రాఫ్ నమోదు చేసుకోవాలి.

– పి.మురళీకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు, తాడేపల్లిగూడెం

8 నుంచి మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

అత్తిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొనే మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ఈనెల 8, 11 తేదీల్లో అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని మండల క్రీడాకోఆర్డినేటర్ వైఎస్సార్ సోమయాజులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న అథ్లెటిక్స్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, 11న వాలీబాల్, కబడ్డీ, యోగా, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీల్లో అండర్-14- అండర్-17 విభాగాలలో క్రీడాకారుల ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. అండర్-14 విభాగంలో బాలబాలికలు 1 జనవరి 2010 అనంతరం, అండర్-17 విభాగంలో బాలబాలికలు 1 జనవరి 2007 తర్వాత జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారుల ఎంపికలో అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, అప్పర్ ప్రైమరీ, ప్రైవేటు పాఠశాలల క్రీడాకారులు జట్టుగా పాల్గొనవచ్చని చెప్పారు. అథ్లెటిక్స్ విభాగంలో మాత్రం పాఠశాల నుంచి ఒక ఈవెంటుకు ఇద్దరు మాత్రమే పాల్గొనాలని, ఇతర వివరాలకు క్రీడా కోఆర్డినేటర్, కొమ్మర పీడీ వైఎస్సార్ సోమయాజులను సంప్రదించవచ్చని చెప్పారు.

ఇంటిముంగిటకొచ్చి.. పింఛన్లు అందించి



అత్తిలిలో కొత్తగా మంజూరైన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: తెల్లతెల్లవారి తలుపుతట్టి వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ఇంట ముంగిటకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలంలో కొత్తగా మంజూరైన 505 పింఛన్లు, 370 రేషన్‌కార్డులను లబ్ధిదారులకు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కందుల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు సుంకర నాగేశ్వరరావు, దారం శిరీషా, ఉనికిలి సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలినాటి చంద్రరావు, ఆకుల పండుస్వామి, కంకటాల సతీష్, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, తానుకొండ దయామణి, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



తహసీల్దార్ దుర్గాకిషోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం దేశంలో ఉన్న కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ పేద, సామాన్య ప్రజలపై భారాలు మోపిందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను హరించిందన్నారు. అనంతరం తహసీల్దార్ వై.దుర్గాకిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలుపర్తి సత్యనారాయణ, గుత్తుల నర్సయ్య, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధరలను నియంత్రించాలని వినతి.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

అత్తిలి: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని సీపీఎం నాయకులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం అత్తిలి తహసీల్దార్ ఏవీ రామాంజనేయులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు డి ధర్మేంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల ఆకస్మిక తనిఖీ



తణుకు డిగ్రీ కళాశాల అధ్యాపకుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ హాజరు కాకపోవడాన్ని ఆరా తీసిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడారు. వేరే కళాశాల నుంచి ఇక్కడకు ఇటీవల బదిలీపై వచ్చిన ప్రిన్సిపాల్ విధులకు హాజరుకాకుండా విజయవాడలోని కమిషనరేట్ కార్యాలయంలోనే విధులకు హాజరవుతున్నట్లు తెలిసింది. కళాశాల విద్యా శాఖ కమిషనర్‌తో మాట్లాడి ప్రిన్సిపాల్ హాజరు కాకపోవడంపై వివరాలు తెలుసుకున్నారు. కళాశాలలో అధ్యాపక సిబ్బంది పనితీరును కూడా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల పనితీరు, అధ్యాపకుల పనితీరుపై మంత్రి కారుమూరికి వివరించారు. కళాశాల అధ్యాపకులపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థినులు మరుగుదొడ్ల సమస్యను మంత్రికి వివరించడంతో వెంటనే ఆ సమస్యను పరిష్కరించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నాక్ నిధుల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం స్పిరిట్ లయన్స్‌క్లబ్, డైమండ్స్ లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మదన్‌మోహన్ అగర్వాల్ బంధువుల వేడుకను పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. శానిటరీ వర్కర్లకు బియ్యం, నిత్యావసర వస్తువులను అందించారు. ముఖ్యఅతిధిగా లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామ్మోహనరావు తదితరులు హాజరయ్యారు. డైమండ్స్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్యలు పాల్గొన్నారు. స్పిరిట్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు నూకల జయభారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

దుంపగడప కళాశాలలో కంటి పరీక్షలు



దుంపగడప కళాశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: కంటి చూపు కోల్పోతే ప్రపంచమే అంధకారమవుతుందని ప్రిన్సిపాల్ కె.సుజాత అన్నారు. దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు, అధ్యాపకులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ కంటి చూపు కోల్పోకుండా చూసుకోవాలన్నారు. కంటిచూపు పెరగడానికి అవసరమైన ఆహారపు అలవాట్లను పెంచుకోవాలని సూచించారు. సైన్సు అధ్యాపకులు డాక్టర్ పీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంతిని గుర్తించి నేత్ర నరాల ద్వారా మెదడుకు సమాచారం అందించే అవయవం కన్ను అన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో 100 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేశారు.

జక్కరంలో కేంద్ర బృందం పర్యటన

కాళ్ల: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2023 పురస్కారానికి ఎంపికైన జక్కరం గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ సెంట్రల్ టీమ్ సభ్యులు సోమవారం పర్యటించి పరిశీలించారు. మరుగుదొడ్ల వాడకం, రోడ్లు, డ్రైయినేజ్ క్లీనింగ్, ఇంటింటి చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ సెంటర్‌లో వర్మి కంపోస్ట్ యూనిట్, డ్రైవేస్ట్ మేనేజ్‌మెంట్, షెడ్ దగర ఉన్న సౌకర్యాలు పరిశీలించారు. అనంతరం గ్రామ సుందరీకరణ, సచివాలయ ప్రొఫైల్, రిజిస్టర్లు, రిపోర్ట్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచింపూడి పద్మావతీ, ఉప సర్పంచ్ లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు వేగేశ్న విజయ, ఎంపీడీఓ జి.స్వాతి, డీపీఆర్సీ ఎస్.ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి షేక్ జమాల్, స్వచ్ ఆంధ్ర కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ దినేష్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నడిపూడిలో రహదారి నిర్మాణం

పెనుగొండ: నడిపూడి కట్టావారిపాలెం రహ దారిని రూ.25లక్షల వ్యయంతో నిర్మిస్తున్నా రు. దశాబ్ద కాలంగా రహదారి లేక కట్టావారిపాలెం ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వంలో స్థానికులు మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి ఈ సమ స్యను తీసుకువెళ్లడంతో ఆయన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, సొసైటీ అధ్య క్షుడు కె. గణపతి, కడలి శ్రీను పర్యవేక్షించారు.

7న అలంపురంలో మెగా వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని వెంకటరమణ సేవాధారిటీ ఆసుపత్రిలో ఈనెల 7న ఉదయం 10 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజానగరం జీఎస్‌ఎల్ జనరల్ ఆసుపత్రి నుంచి ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు, జనరల్ సర్జన్, చర్మవ్యాధుల నిపుణులు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, చెవి, ముక్కు, గొంతు తదితర వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్యనిపుణులు పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లయన్స్ అవార్డుకు ఎంపికైన టీఎస్ఎన్ ప్రసాద్



టీఎస్ఎన్ ప్రసాద్‌కు లయన్స్ ఉత్తమ అవార్డు అందిస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, తదితరులు

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగాధిపతిగా పనిచేస్తున్న టీఎస్ఎన్ ప్రసాద్ లయన్స్‌క్లబ్ సంస్థ అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఏలూరులో ఈనెల 3న లయన్స్‌క్లబ్ ఇంటర్‌నేషనల్ అవార్డుల కార్యక్రమంలో ఈ అవార్డును ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ చేతుల మీదుగా అందించారు. పెంటపాడు డీఆర్ గోయంకా కళాశాలలో ఆయనను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు ఒకే ఒక అర్జీ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కడియద్ద గ్రామానికి చెందిన దిర్శిపాముల రమణ ఇంటి స్థలం మంజూరు చేయాలని అర్జీని అందజేశారని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు సత్కారాలు

సాక్షి, భీమవరం: గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన ఆరుగురు ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు మానవత భీమవరం శాఖ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటపతిరాజు చెప్పారు. త్యాగరాజ భవనంలో ఉదయం 10 గంటలకు నడపన నాగేశ్వరరావు, కాకర్ల రాజరాజేశ్వరి, కేబీవీ మురళీకృష్ణ, కూనపరాజు మాధవి, జీపీసీ శేఖర్‌రాజు, దాయన సురేష్‌చంద్రజీలను పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఆర్ రాజు చేతుల మీదుగా సత్కరిస్తామన్నారు.

తహసీల్దార్ మృతికి సంతాపం

ఉండి: ఉండిలో తహసీల్దార్ గా పనిచేసి బదిలీపై నర్సాపురం ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన ఎం. రవీంద్రకుమార్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి ఉండి మండల వీఆర్వోల సంఘం సంతాపం ప్రకటించినట్లు సంఘ మండల అధ్యక్షుడు ఎస్.చిన్నారావు తెలిపారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: దాడి ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. దెయ్యాలతిప్పకు చెందిన రామాని పూర్ణచంద్రరరావు సోదరితో బంధన వెంకటేశ్వరరావుకు వివాహం కాగా వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పదేళ్ల క్రితం పూర్ణచంద్రరావు సోదరి మృతి చెందగా, ఆమె పిల్లలు పుట్టింటి వద్ద ఉంటున్నారు. 2023 సంవత్సరంలో బంధన వెంకటేశ్వరరావు రెండో వివాహం చేసుకున్నాడు. ఈ నెల 3వ తేదీన మొదటి భార్య పుట్టింటికి వెంకటేశ్వరరావు వచ్చి పిల్లలపై కేకలు వేస్తుండగా రామాని పూర్ణచంద్రరావు, ఆయన తల్లి ఎందుకు కేకలు వేస్తున్నావని నిలదీశారు. దీంతో పూర్ణచంద్రరావుపై వెంకటేశ్వరరావు దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్సై డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతోనే అభివృద్ధి

యలమంచిలి: విద్య ద్వారా కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని పాలకొల్లు మన్యం జగమ్మ సత్రం ఛైర్మన్ నంబూరి శ్రీ గంగా పవన్‌కుమార్ అన్నారు. కొంతేరు, మేడపాడు లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సోమవారం ఆయన నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మేడపాడు ఎంపీటీసీ దేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కడలి రామలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసు స్పందనలో 15 ఫిర్యాదులు

సాక్షి, భీమవరం: స్పందనలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. సోమవారం నిర్వహించిన పోలీసు స్పందనలో ఆయన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.